క్లుప్తంగా

ధ్వజస్తంభం పునఃప్రతిష్ట

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయ పునః నిర్మాణం సందర్భంగా ఆలయం ముందు ఉన్న పురాతన శాసనాలు, దీపస్తంభాన్ని తొలగించారు. త్వరలో జరగనున్న మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు పూజలు నిర్వహించి పురాతన శిలాశాసనం, దీపస్తంభాన్ని పునఃప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్.ఐ రవికుమార్ తెలిపారు. బుధవారం చీకలబైలు వద్ద రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జీఎం పాలెంకు చెందిన వెంకటరమణ కుమారుడు టీ.మధు (38) ఆటోలో మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుని వద్ద నుంచి రూ.1650 విలువగల 3 లీటర్ల బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

ఘనంగా వసంత పంచమి



అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: స్థానిక దేవతానగర్‌లోని చైతన్య సేవా సంస్థ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సరస్వతి చిత్రపటానికి పూజలు చేశారు.విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. చదువుల తల్లి సరస్వతిదేవి కృపాకటాక్షాలు విద్యార్థులపై ఉండాలని, వారు అనుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. డాక్టర్ సాయికిషోర్ విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. రిటైర్డు సూపరిండెంట్ రామకృష్ణారెడ్డి పలకలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఆనందన్, ఏటీ బాబు, కోశాధికారి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర కలశం ప్రతిష్ట

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలో వెలసిన శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శిఖర కలశం ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి గణపతి పూజ, స్వస్తవాచనము, పంచగవ్య శుద్ధి, క్షీరాభిషేకము, హరిద్రాభిషేకము, శాంతి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, కేశవ రెడ్డి, శంకరాచారి, రెడ్డిశేఖర్‌రెడ్డి, పద్మజ, చింతల సుధీర్ రెడ్డి, కళ్యాణి, రఘునాథ రెడ్డి, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతజీవనం సాగించాలి

పీలేరు రూరల్ : గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని ముడుపులవేముల పంచాయతీ తానావడ్డిపల్లె, రాయలవారిపల్లెలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమీపిస్తుండడంతో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, కోడిపందాలు, జూదం, అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసులు



రామసముద్రం: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆయనకు స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ దైవరాజన్ విజయవాడ సీసీఎల్‌కు బదిలీ అయ్యారు.

జగనన్నను మరోసారి ఆదరించండి

- వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం జగన్‌ను ఆదరించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కురబలకోటలో రూ.50 లక్షలతో నిర్మించిన నూతన సింగిల్ విండో భవనం, తెట్టు, చింతమాకుపల్లె గ్రామాల్లో రూ.6 కోట్లతో చేపట్టిన సచివాలయం, ఆర్బీకే, ద్వారక ఉద్యాన పార్కు, తెట్టు ఆలయ గాలిపోపుర నిర్మాణానికి శంకుస్థాపన, పులుసుగుంతల కొత్త రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. తెట్టు సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏముఖ్యమంత్రి చేపట్టని విధంగా నేరుగా లబ్ధిదారులకే వివిధ పథకాల కింద బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల వారికి అటు రాజకీయ పదవుల్లోను, ఇటు ప్రభుత్వ పదవుల్లోను సామాజిక న్యాయం పాటించారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల గడప తొక్కించారన్నారు. ఏళ్లుగా పక్కా రోడ్డుకు నోచుకోని పులుసుగుంతలకు రూ.3.57 కోట్లతో తారు రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రతి ఊరికి రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. బాబువి హామీలు తప్ప ఆచరణ ఉండదన్నారు. గతంలో కూడా రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని చేతులెత్తేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ బ్యాంకు చైర్ పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చేర్ పర్సన్ జి.అరుణమ్మ, జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు నులక మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డి, మండల కన్వీనర్ కొళ్ల వాసుదేవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎస్‌వీ రమణారెడ్డి,భూదేవి తదితరులు పాల్గొన్నారు.

పులుసు గుంతలలో ఉప్పొంగిన అభిమానం : తెట్టు గ్రామ పర్యటనలో భాగంగా బుధవారం చింతమాకుపల్లె సచివాలయ పరిధిలోని మారుమూల గ్రామం పులుసుగుంతల ఊరిలో ఎమ్మెల్యేకి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. మండలంలోనే ఈ ఊరు మారుమూల గుట్ట ప్రాంతంలో ఉంది. ఎమ్మెల్యే ఈ ఊరికి తెట్టు నుండి పులుసుగుంతల మీదుగా మిట్టామర్రి వరకు ఐదు కిలోమీటర్లకు పైగా తారు రోడ్డు వేయించారు. ఏపీపీఆర్‌పీ/ఈఏపీ–2 కింద రూ. 3.57 కోట్లతో ఈ రోడ్డు వేయించారు. బుధవారం ఈ రోడ్డును ప్రారంభించారు.

సింగిల్ విండో బ్యాంకులను ఆదరించాలి

కురబలకోట: రైతులకు ఎలాంటి రెకమెండేషన్ లేకుండా నేరుగా రుణాలు అందించే సింగిల్ వీండో (పీఎసీఎస్)లను ఆదరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, జిల్లా డీసీసీబీ బ్యాంకు చేర్ పర్సన్ మొగసాల రెడ్డెమ్మ అన్నారు. బుధవారం వారు డీసీసీబీ డైరెక్టర్, స్థానిక సింగిల్ విండో చేర్ పర్సన్ జి. అరుణమ్మ ఆధ్వర్యంలో కురబలకోటలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన విండో భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ బ్యాంకు లోను ఇవ్వకున్నా సింగిల్ విండోలు మాత్రం రైతులకు లేదనకుండా రుణాలు ఇస్తాయన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి విండో అభివృద్ధికి పాటుపడాలన్నారు. సీఈఓ మనోహర్ గౌడ్, శ్యాం ప్రసాద్ రెడ్డి, రవీంద్రనాధ్, సోమశేఖర్‌రెడ్డి, ఆర్వీకే శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసులు, విండో సీఈఓ రాజన్న, సిద్దే రమేష్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఆరోగ్యశ్రీతో 90 శాతం కుటుంబాలకు లబ్ధి
- రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు
- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నిసార్‌అహ్మద్



మాట్లాడుతున్న సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, 108, 104, ఆరోగ్య సేవలతో ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నిసార్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 11,12,13,14 వార్డులలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష– 2 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం నూతనంగా ముద్రించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కాన్సిలర్లు జింకా రాధమ్మ, ఫర్జానారఫీ, షబానా ఆధ్వర్యంలో సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా చలపతి, నూర్ ఆజంలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సామవేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యం కోసం అప్పులపాలై , నానా అవస్థలు పడకుండా ప్రతి పేదవాడు కార్పొరేట్ వైద్యం అందుకోవాలని కృత నిశ్చయంతో మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆయన కుమారుడిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగైన వైద్యసేవలు అందేలా 3225 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చి, రూ.25 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశం కల్పించి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు ప్రైవేటు ఆస్పత్రులల్లోనూ ఆధునాత వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీ ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేశారన్నారు. కేన్సర్ వంటి మహమ్మరి బారిన పడిన బాధితులకు పరిమితి లేని చికిత్సలు అందిస్తూ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడినవారికి ఆరోగ్యశ్రీ పథకం సంజీవనిలా పని చేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలరుల చంద్రశేఖర్, రాజేష్, శీనా, ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు

మదనపల్లె: మునిసిపల్ కార్మికుల 16 సమ్మె కాలపు ఒప్పందాలు, జీవోలు తక్షణమే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం మాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ శానిటేషన్ క్లీన్ వర్కర్స్‌కు రూ. 21,000 – 24,500 జీతాల జీఓలు, సంక్షేమ పథకాలు, మొత్తం మున్సిపల్ కార్మికులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75000, ఎక్స్‌గ్రేషియో, మట్టి ఖర్చులు తదితర జీఓలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని కోరారు. సమ్మె ముగిసి నెల రోజులు గడుస్తున్నా నేటికీ వేతనాలతో సహా ఇతర జీవోలు జారీ చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. మదనపల్లి పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ పూర్తిగా రద్దు చేసి, నూతన కన్వీనర్ గా ఎస్ మస్తాన్‌ను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ వంగిమళ్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటప్రసాద్‌రెడ్డి ఈ నెల 12 హైదరాబాద్‌లో మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం వంగిమళ్లవారిపల్లెకు చేరుకుని వెంకటప్రసాద్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు జెడ్పీటీసీ గజ్జెల శృతి, రాస్ మల్లికార్జునరెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, యర్రమరెడ్డి, దినేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రవీంద్రరెడ్డి, బాలకృష్ణ, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

– జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

కలికిరి: ఈ–పంట నమోదు చేసుకున్న రైతులకు వెంటనే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రనాయక్ అన్నారు. మండలంలోని గుట్టపాళెం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ–పంట నమోదు చేయించుకోవాలని, అనంతరం ఈకేవైసీ చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి నేడు తుది గడువు ఉన్నా గుట్టపాళెం గ్రామ పరిధిలోనే 57 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోక పోవడంపై ఆర్బీకే సిబ్బందిని విచారించారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఏడీఏ వాణిశ్రీ, ఎవో మమతారెడ్డి, వీఏఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలను ఆదుకోవాలి

కేవీపల్లె : మండలంలోని మఠంపల్లె పంచాయతీ కలికిరివాండ్లపల్లెలో గుడిసెలు వేసుకుని నివాసం ఉన్న గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. బుధవారం గిరిజన కుటుంబాలతో కలసి వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు నివాసం ఉంటున్న స్థలాలపై కొందరు ప్రయివేట్ వ్యక్తులు అభ్యంతరం తెలుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు వారికి అనుకూలంగా ఉంటూ గిరిజనులను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. గిరిజనులు నివాసం ఉన్న చోటే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నల్లవీర గంగాభవాని జాతరకు సర్వం సిద్ధం



జాతర ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మదనపల్లె: రాయలసీమ జిల్లాల్లో మొట్టమొదటి జాతరగా జరిగే మదనపల్లె మండలం , సిటిఎం (చిన్నతిప్ప సముద్రం)శ్రీ నల్లవీర గంగాభవాని జాతరకు సర్వం సిద్ధం చేశారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, సిటిఎం సర్పంచ్, స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, వైఎస్సార్సీపీ నాయకులు వెలుగు చంద్ర, కమిటీ సభ్యులు పొగాకు వీర ప్రతాప్, ఎర్ర శివా రెడ్డి, రూపేష్ దేవ రాయల్, స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సిటిఎం గంగ జాతర ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు ప్రసిద్ధికి ఎక్కారన్నారు. ఈనెల 24న మూలవిరాట్టుకు పంచామృతాభిషేకంతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 25వ తేదీ సిద్దుల భుక్తి, అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 26న రాత్రి తిరుణాల అమ్మవారి ఊరేగింపు, 27వ తేదీ మంగళవారం పగలు తిరుణాల, కల్లి పాటు, అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 28వ తేదీ దోపు తిరణాలతో జాతర మహోత్సవాలు ముగుస్తాయన్నారు.

అంబేడ్కర్ పోరాటం స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న బహుజన భీమ్ సేన నాయకులు

మదనపల్లె: బడుగు బలహీనులు, దేశ ప్రజల హక్కుల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ యమలా సుదర్శనం అన్నారు.బుధవారం బహుజన భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు పుంగనూరు శేషాద్రి ఆధ్వర్యంలో స్థానిక రామారావు కాలనీ పార్క్ ఆవరణంలో అంబేడ్కర్ నూతన విగ్రహావిష్కరణ జరిగింది. ముందుగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తూ గొల్లపల్లి సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా నాయకులు తోపు కృష్ణప్ప, వీకేసీ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్. వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు రేపణ మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశ ప్రజల హక్కులు, దళితుల విముక్తి కోసం జీవితాంతం పోరాడారన్నారు. కార్యక్రమంలో బహుజన భీమ్ సేన నాయకులు నాగరాజు, నాగార్జున, సుధీర్, జగదీష్, వేదాంత్, అల్తాఫ్, చెన్న కేశవరెడ్డి, రాము, గంగులప్ప, రాజు బాబు, రామ్మూర్తి, గోపాల్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత డిపోగా తీర్చిదిద్దాలి

పీలేరు రూరల్ : ఆర్టీసీ డిపోను ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని ఎంవీఐ విజయకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు, కండెక్టర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి మానసిక ప్రశాంతతతో విధులకు హాజరు కావాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. డీఎం కుమార్ మాట్లాడుతూ జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా డ్రైవర్లు పని చేయాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఎస్.ఏ. హక్, ఎన్. వాసు, ఎస్.ఎం. వలీలను ఘనంగా సన్మానించారు. సీఐ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై గోవిందుడు



సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆరు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబులు స్వామికి ప్రత్యేక అలంకరణచేసి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు చేసి ఊరేగింపు నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింప చేశారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ డిశంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభ్యాగులకు ఆకలి తీర్చడానికే ఫుడ్ బ్యాంకు

మదనపల్లె సిటీ: అభాగ్యులు, అన్నార్తుల ఆకలి తీర్చడానికి పుల్వామా ఘటనలో అమరులైన దేశ సైనికుల జ్ఞాపకార్థం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఫుడ్ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఫుడ్‌బ్యాంకు వద్ద పుల్వామా అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఫుడ్ బ్యాంకు ద్వారా ఎంతో మందికి ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో పుట్టినరోజు, శుభకార్యాలు సమయంలో ముందుకు వచ్చి అనార్తుల ఆకలి తీర్చడం జరుగుతుందన్నారు. ఫంక్షన్లలో మిగిలిన ఆహారంను ప్యాక్ చేసి ఫుడ్ బ్యాంకులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఇలియాజ్, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పీలేరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 90 మంది మహిళా విద్యార్థినులకు రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ స్త్రీలలో సాధారణంగా హార్మోన్లు, రక్తహీనత సమస్యలు, క్యాల్షియం లోపం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం బాగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. మంచి ఆరోగ్యవంతమైన విద్యార్థినులకు ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్లు లక్ష్మీ, శ్వేతా రాణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 29 మంది ఎంపిక

పీలేరు : స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 29 మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంజేఆర్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన సూర్యటెక్ సొల్యూషన్స్ మేనేజర్ సతీష్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 92 మంది హాజరు కాగా 29 మంది ఉద్యోగానికి ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ రెడ్డిఖాసీం, చామర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

టీబీ, కుష్టు నివారణపై అవగాహన

రామసముద్రం: మండలంలోని చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మట్లవారిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం టీబీ, కుష్టు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నూరుల్లా , డీపీవోలు శ్రీనివాస్, పద్మావతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కుష్టు ఒకరి నుంచి ఎలా వ్యాప్తి చెందుతుంది , వ్యాధి లక్షణాల గురించి విద్యార్థులకు వివరించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు , సూచనలు తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, సంక్రమణ వ్యాధులు నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉమాదేవి, హెచ్ఎం బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు , ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న డ్రైవర్ రమణ

మదనపల్లె సిటీ: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ సంస్థ ఉత్తమ డ్రైవర్లను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో వన్ డిపో నుంచి ఎస్.ఏ.పీర్, టు డిపో నుంచి జీ.ఎ.ఖాన్, పీలేరు డిపో నుంచి ఎ.ఎ.బాషా ఎంపికయ్యారు. డిపో స్థాయిలో వన్ డిపో నుంచి పి.ఆర్.కృష్ణ, జివిఎల్ రమణ, యు.నరసింహులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఎంపికైన డ్రైవర్లకు రాయచోటిలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో జిల్లా ఎస్పీ కృష్ణారావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. వీరిని జిల్లా ప్రజారవాణాధికారి రాము, డిఎం మూరే వెంకటరమణారెడ్డి అభినందించారు.

ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ

కురబలకోట: మండలంలోని చేనేత నగర్‌లో ఉండే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి రాజశేఖర్ నాయక్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. పోటీల్లో 240 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా వాటిలో 21 ప్రాజెక్టులు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. వీటిలో రాజశేఖర్ నాయక్ ప్రదర్శించిన అగ్రికల్చర్ సైకిల్ స్ప్రేయర్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ తమటం రామాంజనేయ రెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం సమీప ప్రాంతంలో బుధవారం ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన ఆరుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద లభించిన రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరుసు పోస్టర్లు ఆవిష్కరణ

వాల్మీకిపురం: స్థానిక హజ్రత్ ఖ్వాజా పీర్ మస్తాన్ వలి దర్గాలో ఈ నెల 23 నుంచి జరగనున్న ఉరుసు ఉత్సవాల పోస్టర్లను బుధవారం ముస్లిం మత పెద్దలు ఆవిష్కరించారు. ఈ నెల 23న గంధం, ముషాయిరా, 24న ఉరుసు, ఖవాలీ, 25న తహలీల్ ఫాతెహా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉరుసును జయప్రదం చేయాలని మైనార్టీ నాయకులు కోరారు.